సూర్య www.suryaa.com
18 వ వసంతంలోకి.. www.suryaa.com
EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య www.suryaa.com
4 PM www.suryaa.com
శుక్రవారం 26-09-2025
పేజీలు: 02



## చీరలు దొంగిలించిందని మహిళను నడిరోడ్డుపైకి ఈడ్చుకొచ్చి

కర్ణాటక రాజధాని బెంగళూరులో అమానుష ఘటన చోటు చేసుకుంది. ఓ దుకాణంలో చీరలు దొంగిలించిందన్న కారణంతో మహిళను షాప్ యజమాని నడి రోడ్డుపైకి ఈడ్చుకొచ్చి దారుణంగా కొట్టాడు. కాళ్లతో తంతూ దూషించాడు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. బెంగళూరు అవెన్యూ రోడ్డులోని మాయా సిల్క్స్ శారీస్ అనే దుకాణంలోకి ఈ నెల 20న ఓ మహిళ వెళ్లింది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో దుకాణంలోకి వెళ్లిన ఆమె అక్కడున్న దాదాపు రూ.91,500 విలువైన 61 చీరలు ఉన్న కట్టను దొంగలించింది. ఆమె చీరలను దొంగలిస్తున్నట్లు దుకాణంలోని సీసీటీవీ ఫుటేజ్‌లో రికార్డైంది. దీంతో దుకాణం యజమాని సదరు మహిళపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడి ఫిర్యాదు మేరకు సిటీ మార్కెట్ పోలీసులు కేసు నమోదు చేశారు.

# సుప్రీంకోర్టు కీలక తీర్పు..

## ఓటుకు నోటు కేసులో మత్తయ్యకు ఊరట

ఓటుకు నోటు కేసు వ్యవహారంలో జరూసలేం మత్తయ్యకు ఊరట లభించింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ని సుప్రీంకోర్టు కొట్టిపారేసింది. జరూసలేం మత్తయ్యపై దాఖలైన ఎఫ్ఐఆర్‌ను తెలంగాణ హైకోర్టు గతంలో క్వాష్ చేసింది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు ఉత్తర్వులను సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ఈ కేసుపై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం హైకోర్టు నిర్ణయాన్ని సమర్ధించింది. బీఆర్ఎస్ ప్రభుత్వ పిటిషన్‌ను కొట్టిపారేసింది. ఓటుకు నోటు కేసుకు సంబంధించి జరూసలేం మత్తయ్యపై 2016లో ఎఫ్ఐఆర్ నమోదు అయింది. ఈ ఎఫ్ఐఆర్‌ను హైకోర్టు కొట్టివేసింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ఏసీబీ 2016 జులై 6వ తేదీన సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం



విచారణ జరిపింది. తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి వాదనలు వినిపించారు. ఈ కేసులో ఏ2గా ఉన్న సెబాస్టియన్, ఏ4 మత్తయ్యలు దాదాపుగా ఇరవై సార్లు ఫోన్లలో సంభాషించుకున్నారని కోర్టుకు తెలిపారు. దానిపై దర్యాప్తు జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. మత్తయ్యను విచారించాల్సిన అవసరాన్ని పరిగణనలోకి తీసుకోకుండా హైకోర్టు కేసును కొట్టివేసిందని చెప్పారు. ఈ వాదనను మత్తయ్య తరఫు న్యాయవాది ఖండించారు. ఆయన క్రైం సీన్‌లో లేరని, కేసులో ఇరికించారని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం తీర్పును వాయిదా వేసింది. శుక్రవారం తుది తీర్పును వెలువరించింది. హైకోర్టు తీర్పును సమర్ధించింది. తెలంగాణ ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను కొట్టి పారేసింది. దీంతో మత్తయ్యకు ఊరట లభించింది.



## కోనేరు కోనప్ప తిరిగి బీఆర్ఎస్ పార్టీ గూటికి చేరారు

సిర్పూర్ నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ పార్టీకి ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తిరిగి బీఆర్ఎస్ పార్టీ గూటికి చేరారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు హరీశ్ రావు, జగదీశ్ రెడ్డి కూడా పాల్గొన్నారు. కోనేరు కోనప్పతో పాటు ఆయన సోదరుడు కోనేరు కృష్ణారావు కూడా బీఆర్ఎస్ పార్టీలో చేరారు.2023 అసెంబ్లీ ఎన్నికల్లో కోనేరు కోనప్ప బీఆర్ఎస్ తరపున పోటీ చేసి పరాజయం పాలయ్యారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బీఆర్ఎస్ పార్టీలో చేరిన తర్వాత ఆయన ఆ పార్టీకి దూరంగా ఉంటూ వచ్చారు. ఆ తర్వాత కాంగ్రెస్ లో చేరారు. గత కొంతకాలంగా ఆయన కేసీఆర్ నాయకత్వానికి అనుకూలంగా ప్రకటనలు చేస్తుండటంతో తిరిగి పార్టీలో చేరతారనే ఊహాగానాలు వినిపించాయి. ఈరోజు ఎర్రవెల్లిలో కేటీఆర్, హరీశ్ రావుల సమక్షంలో ఆయన తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరారు.



## నా స్నేహితుడి ప్రాణం తీశారు: ఎమ్మెల్యే గంటా

వైసీపీ వేధింపులపై చర్చ సందర్భంగా టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. కరోనా సమయంలో అమెరికా నుంచి వచ్చిన వాట్సప్ మెసేజ్‌ను తన స్నేహితుడు ఫార్వర్డ్ చేశాడని, అది వైసీపీ నేతను అవమానపరిచేలా ఉందని సీఐడీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారని అన్నారు. విశాఖ నుంచి కర్నూలుకు తరలించగా.. కరోనా బారిన పడి మరణిం చారని ఆరోపిం చారు. ఈ ఘటనకు వైసీపీ ప్రభుత్వమే బా ధ్యత వహిం చాల్సి ఉంటుందన్నారు.

## హైదరాబాద్ రైలులో ఉగ్రవాదులు..

# పోలీసులు తనిఖీలు



హౌరా నుంచి సికింద్రాబాద్ వస్తున్న ఫలక్‌నుమా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో ఉగ్రవాదులున్నారంటూ రైల్వే పోలీసులకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఘట్‌కేసరి రైల్వే స్టేషన్‌లో ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైలును నిలిపివేశారు. అనంతరం స్థానిక పోలీసుల సహాయంలో రైల్వే బోగీలలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. అందులో భాగంగా జనరల్, స్లీపర్, ఏసీ బోగీల్లో అణువణువు తనిఖీలు చేపట్టారు. ఆ క్రమంలో సందేహాస్పదంగా కనిపించిన వారిని గుర్తింపు కార్డులు చూపించాలని పోలీసులు కోరారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా ఉన్న పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. వారి సైతం వ్యక్తిగత వివరాలు వెల్లడించారు. అయితే తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు కానీ.. వస్తువులు కానీ లేకపోవడంతో.. ప్రయాణికులతోపాటు పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఫేక్ కాల్ అని పోలీసులు ఈ సందర్భంగా నిర్ధారించారు. మరోవైపు రైలు నిలిపివేయడంతో.. అందులోని ప్రయాణికులు.. ముఖ్యంగా చిన్న పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనంతరం రైలు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు ఆలస్యంగా చేరుకుంది.



## వందే భారత్‌కు డిమాండ్.. హైదరాబాద్-పూణే మధ్య మరో 2 రైళ్లు

భారతీయ రైల్వే శాఖ హైదరాబాద్- పూణే మధ్య రెండు కొత్త వందే భారత్ రైళ్లను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఈ రైళ్లు తెలంగాణ, మహారాష్ట్ర మధ్య రైలు కనెక్టివిటీని మెరుగుపరుస్తాయని, ప్రయాణ సమయాన్ని రెండు నుండి మూడు గంటలు తగ్గిస్తాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో నాలుగు వందే భారత్ రైళ్లు సేవలు అందిస్తున్నాయి. సికింద్రాబాద్-పుణే శతాబ్ది ఎక్స్‌ప్రెస్ స్థానంలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ కొత్త రైళ్ల చేరికతో, దక్షిణ మధ్య రైల్వే ఏడు వందే భారత్ సర్వీసులను నడుపుతోంది.

## భారీ వర్షాలు.. ఏపీ సర్కార్ అప్రమత్తం

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం అప్రమత్తమైంది. 24 గంటల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉండటంతో కలెక్టర్లతో హోంమంత్రి వంగలపూడి అనిత ఈరోజు (శుక్రవారం) సమీక్ష నిర్వహించారు. ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు సిద్ధంగా ఉండాలని హోంమంత్రి ఆదేశించారు. కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదకర పాయింట్లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశం ఉందని.. కోస్తాంధ్ర, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయన్నారు. వర్షాల నేపథ్యంలో సహాయక చర్యలకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ పోలీసు, ఫైర్ సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని తెలిపారు. మత్స్యకారులు వేటకు వెళ్ళరాదనని ఆదేశించారు హోంమంత్రి. పొంగిపొర్లే కాలువలు, రోడ్లు దాటే ప్రయత్నం చేయరాదని సూచించారు. ఈదురుగాలులు వీచే సమయంలో చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న వాటి దగ్గర నిలబడరాదని హోంమంత్రి అనిత స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కాగా.. ఉత్తర, మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం.. నేడు వాయువ్య,



పశ్చిమగ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడి.. రేపు దక్షిన ఒడిశా-ఉత్తరాంధ్ర వద్ద తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. దీని ప్రభావంతో ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాలో కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.



## భారీగా పెరిగిన వెండి ధరలు

వెండి ధరలు ఇవాళ భారీగా పెరిగాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో కేజీ వెండిపై రూ.3000 పెరిగి రూ.1,53,000తో ఆల్ టైమ్ రికార్డుకు చేరింది. ఇక 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.440 పెరిగి రూ.1,14,880లు పలుకుతోంది. ఇక 22 క్యారెట్ల 10గ్రా. పసిడి ధర రూ.400 పెరిగి రూ.1,05,300లకు చేరింది. తెలుగు రాష్ట్రాల్లో దాదాపు ఇవే ధరలు అందుబాటులో ఉండనున్నాయి.



## డిగ్రీ ఎగ్గొట్టి మోడలింగ్


ప్రస్తుతం ఈ క్రేజీ హీరోయిన్ పేరు టాలీవుడ్ లో బాగా వినిపిస్తోంది. అలాగనీ ఈ ముద్దుగుమ్మ పెద్దగా సినిమాల్లో నటించలేదు. ఇప్పటివరకు కేవలం రెండంటే రెండు సినిమాల్లో హీరోయిన్ గా యాక్ట్ చేసింది. అందులో ఒకటి యావరేజ్ కాగా మరొకటి పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ మూవీ. దీంతో ఈ అమ్మడికి సినిమా అవకాశాలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా మరో తెలుగు సినిమాలో ఈ అందాల తారకు అవకాశం దక్కించి. క సినిమాతో బ్లాక్ బస్టర్ కొట్టిన కిరణ్ అబ్బవరం నటిస్తున్న తాజా చిత్రం కే ర్యాంప్ లో ఈ ముద్దుగుమ్మకు కథానాయికగా అవకాశం లభించింది. దీంతో ఈ బ్యూటీ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ప్రస్తుతం టాలీవుడ్ లో క్రేజీ హీరోయిన్లలో ఒకరిగా గుర్తింపు తెచ్చుకుంటోన్న ఆమె మరెవరో కాదు యుక్తి తరేజా. నాగ శౌర్య నటించిన రంగబలి మూవీతో తెలుగు సినిమాకు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ మార్కో సినిమాతో పాన్ ఇండియా ఫేమస్ అయ్యింది.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

# భారత్‌తో ఆసియా కప్ టైటిల్ పోరు




ఆసియాకప్‌లో పాకిస్థాన్ ఫైనల్లోకి ప్రవేశించింది. గురువారం జరిగిన సూపర్-4 పోరులో పాక్ 11 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. పాక్ నిర్దేశించిన 136 పరుగుల లక్ష్యఛేదనలో బంగ్లా 20 ఓవర్లలో 124/9 స్కోరుకు పరిమితమైంది. షమీమ్ హుస్సేన్(30) ఒంటరిపోరాటం జట్టును గెలిపించలేకపోయింది. ఆఫ్రిదీ(3/17), రవూఫ్(3/33)..బంగ్లా పతనంలో కీలకమయ్యారు. తొలుత పాక్ నిర్ణీత 20 ఓవర్లలో 135/8 స్కోరు చేసింది. హారిస్(31), నవాజ్(25) రాణించారు. తస్కిన్ అహ్మద్(3/28) మూడు వికెట్లు తీయగా, మెహదీహసన్, రిశాద్ రెండేసి వికెట్లు పడగొట్టారు. ఆదివారం భారత్, పాకిస్థాన్ మధ్య ఆసియా టైటిల్ పోరు జరగనుంది. పాక్ నిర్దేశించిన లక్ష్యఛేదనలో బంగ్లాను మొదటి ఓవర్‌లోనే ఓపెనర్ పర్వేజ్ హుస్సేన్(0)ను ఔట్ చేయడం ద్వారా ఆఫ్రిదీ దెబ్బతీశాడు.సైఫ్ హసన్ ఒకింత తడబడటంతో బంగ్లాకు మెరుగైన శుభారంభం దక్కలేదు. ఆఫ్రిదీ తన మూడో ఓవర్‌లో తౌహిద్(5)ను ఔట్ చేయగా, సైఫ్(18)ను రవూఫ్ పెవిలియన్ పంపడంతో బంగ్లా కష్టాలు రెట్టింపయ్యాయి. వీరిని అనుసరిస్తూ మెహదీ (11), నురుల్ (16) వెంటనే వెంటనే ఔటయ్యారు. ఈ దశలో షమీమ్ హుస్సేన్(30) ఒంటరిపోరాటం చేశాడు. ఏడో వికెట్‌కు తంజిమ్‌తో కలిసి కీలకమైన 24 పరుగులు జోడించాడు. ఆఖరి ఓవర్‌లో 23 పరుగులు అవసరమైన దశలో రిషాద్(16 నాటౌట్) ఫోర్, సిక్స్‌తో ఆశలు రేపినా లాభం లేకపోయింది. పాకిస్థాన్ బ్యాటింగ్ ఘోరంగా తడబడింది. టాస్ గెలిచిన బంగ్లాదేశ్..పాక్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. తస్కిన్ ఇన్నింగ్స్ తొలి ఓవర్ నాలుగో బంతికి ఓపెనర్ ఫర్హాన్(4) మొదటి వికెట్‌గా వెనుదిరిగాడు. టోర్నీలో మంచి ఫామ్‌మీదున్న ఫర్హాన్..షాట్ ఆడే క్రమంలో పాయింట్‌లో ఉన్న రిషాద్ హుస్సేన్ చేతికి చిక్కాడు. దీంతో 4 పరుగులకే పాక్ వికెట్ల ఖాతా మొదలైంది. ఫస్ట్‌డౌన్‌లో వచ్చిన అయూబ్(0) టోర్నీలో నాలుగోసారి డకౌట్‌గా వెనుదిరిగాడు. ఆదిలోనే కీలక వికెట్లు కోల్పోయిన ఒత్తిడిలో ఉన్న పాక్‌కు పరుగుల రాక కష్టమైంది. పవర్ ప్లే ముగిసే సరికి పాక్ రెండు వికెట్లు కోల్పోయి 27 పరుగులకు పరిమితమైంది. దెబ్బమీద దెబ్బ అన్నట్లు 7వ ఓవర్‌లో రిషాద్ బౌలింగ్‌లో ఫకర్ జమాన్(13) మూడో వికెట్‌గా ఔటయ్యాడు.



## కోఠి ఈఎన్‌టీ దవాఖానలో 3 అడుగులమేర చేరిన వరద

హైదరాబాద్‌లో ఎడతెరవపి లేకుండా వర్షం కురుస్తున్నది. గురువారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా భారీ వాన పడుతున్నది. దీంతో కోఠి ఈఎన్‌టీ దవాఖాన నీట మునిగింది. హాస్పిటల్‌లో మూడు అడుగుల మేర వరద నీరు నిలిచింది. వరద నీటికి తోడు డ్రైనేజీల్లో నుంచి సిల్ట్ రావడంతో ఇసుక మేట వేసింది. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అబిడ్స్, నాంపల్లి, ఖైరతాబాద్, పంజాగుట్ట, అమీర్‌పేట, ఎస్ఆర్ నగర్, కూకట్‌పల్లి, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, మెహిదీపట్నం, చాంద్రాయణగుట్ట, ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట, ఉప్పల్, సికింద్రాబాద్, ముషీరాబాద్, ఓయూ, నల్లకుంట, ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో శుక్రవారం ఉదయం నుంచి భారీ వర్షం కురుస్తున్నది. లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. రోడ్లపై పెద్దఎత్తున వర్షం నీరు నిలిచిపోయింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# దిశ మారనున్న మెట్రో

హైదరాబాద్ మహానగరంలో ఎల్‌అండ్‌టీ మెట్రో కథ ముగిసింది. ఎన్నో సవాళ్లను దాటుకుని, ప్రతిష్ఠాత్మకంగా దేశంలోనే తొలిసారిగా పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో మెట్రోను నిర్మించిన సంస్థ ఇకపై మెట్రో కార్యకలాపాలకు దూరం కానుంది. ఇకపై ప్రభుత్వం ఆధ్వర్యంలోనే మెట్రో ప్రాజెక్టు కొత్త పుంతలు తొక్కనుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టుకు రూపకల్పన జరిగింది. మొదట్లో సత్యం కంప్యూటర్స్‌కు అనుబంధ సంస్థగా ఉన్న మేటాస్ ఇన్‌ఫ్రా కంపెనీ మెట్రో రైలు ప్రాజెక్టును చేపట్టేందుకు 2008లోనే ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అయితే, సత్యం కంప్యూటర్స్ సంక్షోభంతో ఆ ప్రతిపాదన అర్ధాంతరంగా ఆగిపోయింది. అనంతరం ఎల్‌అండ్‌టీ సంస్థతో 2010 సెప్టెంబర్ 4న అప్పటి ప్రభుత్వం పీపీపీ విధానంలో మెట్రో రైలు ప్రాజెక్టును చేపట్టేందుకు కన్సెషన్ అగ్రిమెంట్‌ను కుదుర్చుకుంది. దీంతో ఇది దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే అతి పెద్ద పీపీపీ ప్రాజెక్టుగా రికార్డుల్లోకి ఎక్కింది. హైదరాబాద్ మెట్రోరైలు మొదటి దశ సేవలను 2017 నవంబర్ 29న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. నాటినుంచి దశలవారీగా మూడు కారిడార్లలో మొత్తం 69 కి.మీ. మేరకు రైళ్లు అందుబాటులోకి వచ్చాయి. ఉప్పల్, మియాపూర్‌లో రెండు మెట్రో డిపోలను నిర్మించారు. 2020లో వచ్చిన కరోనా



కారణంగా 169 రోజులపాటు మెట్రో రైళ్ల సేవలు పూర్తిగా నిలిచిపోవడంతో ఎల్‌అండ్‌టీ మెట్రో రైలు సంస్థ ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో పడింది. దీంతో అప్పటి నుంచి తమను ఆదుకోవాలంటూ రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తూనే ఉంది. ఆశించిన స్థాయిలో ఆదాయం రాకపోవడం, ప్రాజెక్టు నిర్మాణం కోసం అప్పట్లో తీసుకున్న రుణాలు, వాటికి చెల్లించాల్సిన వడ్డీతో అప్పుల భారం పెరిగిపోవడంతో సంస్థ ఆర్థికంగా కొట్టుమిట్టాడింది. దీంతో తాజాగా జరిగిన చర్చల తర్వాత ప్రాజెక్టును పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించేందుకు ఎల్‌అండ్‌టీ మెట్రో సంస్థ అంగీకరించింది. మెట్రో బాధ్యతల నుంచి ఎల్‌అండ్‌టీ తప్పుకుంటున్నట్లు సంస్థ అంగీకరించిన నేపథ్యంలో రెండో దశ ప్రాజెక్టుకు సంబంధించిన అడ్డంకులు దాదాపుగా తొలగినట్లు తెలుస్తోంది. అయితే మొదటి విడతలోని మూడు కారిడార్లలో 69.2 కిలోమీటర్ల మేరకు పనులు చేపట్టిన ఎల్‌అండ్‌టీని ఎలా సమన్వయం చేసుకుని ముందుకు సాగుతారు, టికెట్ షేరింగ్ ఎలా ఉంటుంది, ఎండ్ టూ ఎండ్ ప్రయాణం సాధ్యమవుతుందా, ప్రయాణికులు రైళ్లను మారాల్సి వస్తుందా.. లేదా.. అనే విషయాలపై కేంద్రం ఇప్పటికీ అనుమానాలు వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలోనే డీపీఆర్‌కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వకుండా ఆపివేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే తాజాగా మొదటిదశ నిర్వహణను కూడా రాష్ట్ర ప్రభుత్వమే చేపట్టేందుకు సిద్ధమవుతున్న తరుణంలో రెండోదశలోని అనుమానాలకు ఇక ఫుల్‌స్టాప్ పడిందని మెట్రోవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



## నేషనల్ క్రష్ లుక్స్

వరుస సినిమాలతో క్షణం తీరిక లేకుండా గడిపే పాన్ ఇండియా స్టార్ రష్మిక మందన్న, షూటింగ్ లేనప్పుడు ఏం చేస్తారు? అభిమానులందరిలో మెదిలే ఈ ఆసక్తికర ప్రశ్నకు ఆమె స్వయంగా సమాధానమిచ్చారు. విరామ సమయాన్ని కేవలం విశ్రాంతికి మాత్రమే కాకుండా, వ్యాపార పనులకు, కుటుంబంతో గడిపేందుకు ఎలా బ్యాలెన్స్ చేసుకుంటారో ఆమె వివరించారు. తన ఆఫ్-స్క్రీన్ జీవితం వెనుక ఉన్న ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. షూటింగ్ లేని రోజుల్లో తన పెంపుడు కుక్కతో సమయం గడపడమంటే ఎంతో ఇష్టమని రష్మిక తెలిపారు. "సాధారణంగా నా పెంపుడు కుక్కతో ఆడుకుంటాను. వాకింగ్‌కు వెళ్తాను. ఖాళీ సమయం దొరికితే మిస్ అయిన షోలు చూస్తాను లేదా పుస్తకాలు చదువుతాను" అని ఆమె అన్నారు. బిజీ లైఫ్‌లో కూడా ఇలాంటి చిన్న చిన్న సంతోషాలను ఆస్వాదించడం ఎంతో ముఖ్యమని ఆమె అభిప్రాయపడ్డారు. కేవలం విశ్రాంతికే పరిమితం కాకుండా, తన వ్యాపార వ్యవహారాలను కూడా తానే దగ్గరుండి చూసుకుంటానని రష్మిక స్పష్టం చేశారు. "కొన్నిసార్లు బ్రాండ్ కాల్స్ మాట్లా డాల్సి వస్తుంది. అలాగే నా 'డియర్ డైరీ' ప్రాజెక్ట్ పనుల్లో నిమగ్నమవుతాను.

## వర్క్‌ఫ్రం హోమ్ ఇవ్వండి.. ఐటీ కంపెనీలకు సైబరాబాద్ పోలీసుల విజ్ఞప్తి

భారీ వర్షాల నేపథ్యంలో ఉద్యోగులకు వర్క్‌ఫ్రం హోమ్ ఇవ్వాలని సైబరాబాద్ పోలీసులు ఐటీ కంపెనీలకు విజ్ఞప్తి చేశారు. శుక్ర, శనివారాల్లో హైదరాబాద్‌తోపాటు రాష్ట్ర వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే గురువారం రాత్రి నుంచి హైదరాబాద్ నగర వ్యాప్తంగా ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తున్నది. ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఐటీ పరిశ్రమలు అత్యధికంగా ఉన్న సైబరాబాద్ పరిధిలోని గచ్చిబౌలి, కొండాపూర్, కోకాపేట్, నానక్‌రామ్‌గూడలో సాధారణ రోజుల్లోనే భారీగా ట్రాఫిక్ జామ్ అవుతుంది. ఇక వర్షాలు కురిస్తే పరిస్థితి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉందని, ఉద్యోగులను ఇంటి నుంచే పనులు చేసేందుకు అనుమతిస్తే ఊరట ఉంటుందని సైబరాబాద్ పోలీసులు కోరారు. దూర ప్రయాణాలకు బదులు ఈ వెసులుబాటు కల్పించాలని సూచించారు.

## వికారాబాద్ జిల్లాలో భారీ వర్షం

రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు, కుంటలు అలుగు దుంకుతున్నాయి. కాగా, వికారాబాద్ జిల్లా కురుస్తున్న కుండ వర్షాలకు జనం అతాలకుతలం అవుతున్నారు. రహదారులన్నీ జలమయమయ్యాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చించల్ పేట అక్నాపూర్ గ్రామాల మధ్య వాగు ఉప్పొంగి ప్రవహిస్తున్నది. పరిగి నస్కల్ వాగు, బూరుగుపల్లి, మైలార్‌దేవ్‌పల్లి వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అప్రమత్తమైన అధికారులు వాగులు దాటకుండా చర్యలు తీసుకుంటున్నారు. అత్యవసరమైతే తప్పా ప్రజలు ఎవరు కూడా బయటకు రావొద్దని సూచిస్తున్నారు.





## సంక్రాంతికి రాబోతున్న నవీన్ పొలిశెట్టి 'అనగనగా ఒకరాజు'

మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి సినిమా తర్వాత నవీన్ పొలిశెట్టి నటిస్తున్న తాజా చిత్రం అనగనగా ఒక రాజు. ఈ సినిమాకు మారి దర్శకత్వం వహిస్తుండగా.. సితార ఎంటర్‌టైన్ మెంట్స్ నిర్మిస్తున్న ఈ మూవీలో మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో వస్తోన్న ఈ చిత్రాన్ని ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ కో ప్రొడ్యూస్ చేస్తుంది. మిక్కీ జే మేయర్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ చిత్రం తాజాగా విడుదల తేదీని ప్రకటించింది. సంక్రాంతి కానుకగా.. జనవరి 14 న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. ఈ సందర్భంగా ప్రమోషనల్ వీడియోను పంచుకుంది.

## టీజీఎస్ఆర్టీసీ కీలక నిర్ణయం

రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన మహాలక్ష్మీ పథకంతో ఆర్టీసీ బస్సులు మహిళలతో కిక్కిరిసి పోతున్నాయి. అలాగే విద్యార్థులు, ఉద్యోగులు సైతం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. దీంతో బస్సు ప్రయాణాలను మరింత సులభతరం చేస్తూ స్మార్ట్ కార్డులు ప్రవేశపెట్టేందుకు ఆర్టీసీ కసరత్తు చేస్తోంది. నగరంలో పైలట్ ప్రాజెక్ట్ చేపట్టి విద్యార్థులకు బస్ పాస్‌లను స్మార్ట్ కార్డుల రూపంలోకి మార్చాలని భావిస్తుంది. ఆ తర్వాత మిగిలిన పాస్‌లతోపాటు మహాలక్ష్మి ఉచిత ప్రయాణ లబ్ధిదారులకు వీటిని జారీ చేయాలని టీజీఎస్ఆర్టీసీ అనుకుంటుంది. అందుకోసం దేశంలోని వివిధ ప్రధాన నగరాల్లో అమలవుతున్న స్మార్ట్ కార్డుల వ్యవస్థ తీరు తెన్నులను సైతం సంస్థ ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. ఈ విధానాన్ని జంట నగరాల్లో ప్రవేశ పెడితే.. ఎదురయ్యే సవాళ్లను వారు అంచనా వేస్తున్నారు.

